


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 25-10-2026 | సంపుటి - 31 | సంచిక - 151 | రూ : 4 | పేజీలు: 8

కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో మళ్లీ బాంబు కలకలం

రెండో రోజూ అదే టెన్షన్



- కోల్‌కతా విమానాశ్రయంలో వరుసగా రెండో రోజు బాంబు బెదిరింపు
- ఫుకెట్ నుంచి వచ్చిన ఇండిగో విమానం టాయ్‌లెట్‌లో బెదిరింపు నోట్
- ప్రయాణికులను సురక్షితంగా దించి విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ
- ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదని స్పష్టం చేసిన అధికారులు
- కేవలం భయాందోళన సృష్టించేందుకే ఈ చర్యగా అనుమానం

2లో



నోయిడాలో భారీ అగ్నిప్రమాదం..


ఒకరు మృతి

- నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.. ఒకరి మృతి
- ఐదు టీ, స్నాక్స్ దుకాణాలు పూర్తిగా దగ్ధం
- ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో ఎల్పీజీ సిలిండర్లు
- మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఒకరు తరువాయి 2లో

జైషే మహ్మద్‌తో లింకులు

ముంబైలో ర్యాపిడో డ్రైవర్ అరెస్ట్



- ముంబైలో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాల ఆరోపణలపై ఒకరి అరెస్ట్
- రాపిడో రైడర్‌గా పనిచేస్తున్న 33 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్న మహారాష్ట్ర ఏటీఎస్
- సోషల్ మీడియా ద్వారా మసూద్ అజార్ ప్రసంగాలను ప్రచారం చేస్తున్నట్లు ఆరోపణలు
- పాక్ మద్దతు ఉన్న టెలిగ్రామ్ ఛానల్‌లో నిందితుడు సభ్యుడిగా ఉన్నట్లు గుర్తింపు
- నిందితుడి డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు 2లో

కేఆర్ఎంబీ భేటీ వాయిదా..

మహారాష్ట్రకు సీఎం రేవంత్

- సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా
- తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం
- సీఎం ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి



2లో

- మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ



వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం

మహిళా జర్నలిస్టులంతా పోరాడాలి

: మంత్రి సీతక్క

- ప్రశ్నించే తత్వమే పత్రికారంగానికి ప్రాణవాయువు
- హైదరాబాద్‌లో ప్రారంభమైన మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు
- వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున హాజరైన మహిళా జర్నలిస్టులు

హైదరాబాద్, ప్రజాస్పూర్తి : రెండు రోజుల పాటు నగరంలో జరుగనున్న జాతీయ స్థాయి మహిళా జర్నలిస్టుల సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) తరువాయి 2లో

పదేళ్ల తర్వాత..

ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి నమోదు!

- ఇవాళ (అక్టోబర్ 24న) 191గా నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI)
- ప్రభుత్వ నిరంతర చర్యల వల్లే ఇది సాధ్యమైందన్న ఢిల్లీ పర్యావరణ మంత్రి
- గత 24 గంటల్లో వేలాది వాహనాలకు చలాన్లు, వ్యర్థాల తొలగింపు



- కాలుష్య నియంత్రణను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తామని స్పష్టీకరణ

2లో



కాంగ్రెస్ పాలనలో

అన్నదాత బతుకే ప్రశ్నార్థకం

- మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : రైతన్నపై కాంగ్రెస్ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాత బతుకే ప్రశ్నార్థకమని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొన్న 'నువ్వు ఇంకా సచ్చి పోలేదా'అంటూ ఓ తహశీల్దార్ రైతును అవమానించారని పేర్కొన్నారు. నేడు కరెంటు గురించి అడిగిన పాపానికి రైతు ముఖంపై ఎస్సై లాఠీ దెబ్బలని తెలిపారు. ఇది ప్రజా పాలన కాదనీ, రాక్షస పాలన అని విమర్శించారు. తరువాయి 2లో

భద్రాద్రికి నీటి భరోసా..

- తాలిపేరు ప్రాజెక్టులో 73.96 మీటర్ల మేర నీటి నిల్వ
- గోదావరి నీటి మట్టం 7.80 అడుగులుగా నమోదు
- ప్రాజెక్టుల్లో నీరు ఆశాజనకం.. కిన్నెరసానిలో 7.970 టీఎంసీలు

ఖమ్మం : తాజాగా విడుదల చేసిన నీటి పారుదల శాఖ నివేదికల ప్రకారం, జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండటంతో పాటు ఆయకట్టు రైతులకు అవసరమైన మేర సాగునీటి విడుదల ప్రశాంతంగా సాగుతోంది. ఎటువంటి వరద ముప్పు లేకపోవడంతో పాటు వానాకాలం సాగు తరువాయి 2లో



వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం మహిళా జర్నలిస్టులంతా పోరాడాలి





హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : రెండు రోజుల పాటు నగరంలో జరుగనున్న జాతీయ స్థాయి మహిళా జర్నలిస్టుల సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫీ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును మంత్రి సీతక్క ప్రారంభించారు. ప్రారంభోత్సవ సభలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తో పాటు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి. రాధారాణి, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, ఐ జె యు స్టీరింగ్ కమిటీ సభ్యులు డి.అమర్, ఎస్. ఎన్.సిన్హా, ఐజేయు అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, సెక్రెటరీ జనరల్ డి.సోమసుందర్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ హాజరయ్యారు. ఈ సదస్సును ఉద్దేశించి రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ... భయంతో ఏ మహిళా తన గొంతును నొక్కేసుకోకూడదని స్పష్టం చేశారు. మహిళల ప్రగతిని బట్టే ఆ సమాజ ప్రగతి ఆధారపడి ఉంటుందని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఏనాడో చెప్పారని తెలిపారు. విధి నిర్వహణలో మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, వ్యక్తిత్వ హననం వంటి చర్యలను తీవ్రంగా ఖండించాలన్నారు. వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం మహిళా జర్నలిస్టులంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

నిజాలను నిగ్గుతేల్చడమే జర్నలిజం కర్తవ్యం: జస్టిస్ రాధారాణి

స్వతంత్ర పత్రికారంగం లేకుండా ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం కాదని జస్టిస్ జి. రాధారాణి పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వమే పత్రికారంగానికి ప్రాణవాయువని, నిష్పాక్షికమైన వాస్తవాలను సమాజం ముందుంచడమే జర్నలిస్టుల కర్తవ్యమని అన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 19(1)(ఎ) భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రసాదిస్తే, అధికరణ 19(2) బాధ్యతాయుతమైన పరిమితులను నిర్దేశించిందని గుర్తుచేశారు. డిజిటల్ మాధ్యమాలు విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో అసత్య ప్రచారాలు, డీప్‌ఫేక్, ఏఐ సాంకేతికత వల్ల విశ్వసనీయతకు ముప్పు వాటిల్లుతోందని, వాస్తవాల పరిశీలన (ఫ్యాక్ట్ చెకింగ్) ఎంతో అవసరమని సూచించారు. కార్యాలయాల్లో పని ప్రదేశ వేధింపుల నిరోధక (పోష్) చట్టాన్ని మీడియా సంస్థలు పక్కాగా అమలు చేయాలని, మహిళా జర్నలిస్టులకు తగిన రక్షణ, వృత్తిపరమైన సమాన అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు.

* న్యాయం కోసం నిలబడే శక్తి మహిళలకుంది: సుమతి*

మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి మాట్లాడుతూ... మహిళలు ప్రతి సమస్యను సమగ్ర కోణంలో విశ్లేషించే సామర్థ్యం కలిగి ఉంటారని, వారు కేవలం డెస్క్‌లకు మాత్రమే పరిమితం కాకుండా ఫీల్డ్ రిపోర్టింగ్‌లో ముందుండి నిర్భయంగా, నేతృత్వం వహిస్తూ ప్రజాస్వామ్యానికి సరికొత్త దిశానిర్దేశం చేయాలని కోరారు. కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్ మాట్లాడుతూ న్యూస్‌రూమ్‌లలో మహిళా జర్నలిస్టులు తమ ప్రాధాన్యాన్ని నిరూపించుకోవాలని, సానుభూతితో కూడిన మానవీయ కథనాలను సమాజానికి అందించాలని పేర్కొన్నారు. ఐజేయూ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్ము ప్రారంభోపన్యాసం చేస్తూ క్షేత్రస్థాయిలో మహిళా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను వివరించారు. ఇటీవల రీతిక చోప్రా వంటి జర్నలిస్టులు ఎన్నికల సంఘం, ఎస్ ఐ ఆర్ గురించి నిర్భయంగా కథనాలు రాసారని గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్టులు స్వప్న, టీయూడబ్ల్యూజే విభాగం కన్వీనర్ రాజేశ్వరి కళ్యాణం, అత్తలూరి అరుణ, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.. ఒకరు మృతి

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, పలు దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. నోయిడా సెక్టార్ 125లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టీ, స్నాక్స్ దుకాణాల్లో తొలుత మంటలు చెలరేగాయి. సెక్టార్ 126 పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయ్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఐదు దుకాణాలకు మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆరు అగ్నిమాపక యంత్రాల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ప్రమాద సమయంలో దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని అలుముకోవడంతో, అధికారులు ముందు జాగ్రత్తగా సమీపంలోని రహదారులను మూసివేసి సహాయక చర్యలు చేపట్టారు. సహాయక చర్యల సమయంలో ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. వెంటనే బాధితుడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో ఎల్పీజీ సిలిండర్లు ఉన్నాయని, వాటి కారణంగా మరింత ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నోయిడా చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వివరించారు.

జైషే మహ్మద్‌తో లింకులు

ముంబైలో ర్యాపిడో డ్రైవర్ అరెస్ట్

ముంబై మహానగరంలో ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (JeM)తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై మహారాష్ట్ర 'ఉగ్రవాద నిరోధక దళం' (ఏటీఎస్) ఒక వ్యక్తిని అరెస్ట్ చేసింది. రాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్న 33 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం కలకలం రేపింది. ఏటీఎస్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితుడిని మహ్మద్ హసన్ అబు సర్మాద్ అక్తర్‌గా గుర్తించారు. ఇతడు బీహార్‌కు చెందినవాడు అయినప్పటికీ, గత పదేళ్లుగా ముంబైలోనే నివసిస్తున్నాడు. నగరంలో రాపిడో రైడర్‌గా పనిచేస్తూ, అదనంగా పెర్ఫ్యూమ్‌లు కూడా అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. ఏటీఎస్ కాలాచౌకీ యూనిట్‌కు అందిన పక్కా సమాచారంతో మాహిమ్ మెట్రో స్టేషన్ సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం మాహిమ్ పోలీసులకు అప్పగించారు. అక్తర్‌పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఇతడు సోషల్ మీడియా, మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేసినట్లు ఏటీఎస్ వర్గాలు అనుమానిస్తున్నాయి. ముఖ్యంగా జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ రెచ్చగొట్టే ప్రసంగాల ఆడియో క్లిప్‌లను ఓ టెలిగ్రామ్ గ్రూప్‌లో అప్‌లోడ్ చేసి సర్క్యులేట్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దీంతో పాటు పాకిస్థాన్ మద్దతు ఉన్న ఓ తీవ్రవాద టెలిగ్రామ్ ఛానల్‌లో కూడా ఇతడు సభ్యుడిగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో నిందితుడిపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 196(1) (వివిధ వర్గాల మధ్య విద్వేషాలను ప్రోత్సహించడం) కింద కేసు నమోదు చేశారు. పోలీసులు అతని డిజిటల్ పరికరాలను (మొబైల్ ఫోన్, ఇతర గ్యాడ్జెట్లు) స్వాధీనం చేసుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అతని ఆన్‌లైన్ కమ్యూనికేషన్లు, ఇతర పరిచయాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇంకా ఎవరెవరికి సంబంధాలున్నాయనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

కేఆర్ఎంబీ భేటీ వాయిదా..

మహారాష్ట్రకు సీఎం రేవంత్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నదాత బతుకే ప్రశ్నార్థకం

హైదరాబాద్ : రైతన్నపై కాంగ్రెస్ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాత బతుకే ప్రశ్నార్థకమని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొన్న 'నువ్వు ఇంకా సచ్చి పోలేదా' అంటూ ఓ తహశీల్దార్ రైతును అవమానించారని పేర్కొన్నారు. నేడు కరెంటు గురించి అడిగిన పాపానికి రైతు ముఖంపై ఎస్సై లాఠీ దెబ్బలని తెలిపారు. ఇది ప్రజా పాలన కాదనీ, రాక్షస పాలన అని విమర్శించారు.

భద్రాద్రికి నీటి భరోసా..

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. చేతికొస్తున్న తరుణంలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. పంటలు దిగుబడులు ఎలా ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జలకళ సంతరించుకోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ జిల్లా పరిధిలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులైన కిన్నెరసాని, పెద్దవాగు, బయ్యారం పెద్ద చెరువు (లక్ష్మీదేవిపేట), తాలిపేరుతో పాటు భద్రాచలం వద్ద గోదావరి నది జలమట్టాలు అత్యంత నిలకడగా, ఆశాజనకంగా కొనసాగుతున్నాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి.

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తాజాగా విడుదల చేసిన నీటి పారుదల శాఖ నివేదికల ప్రకారం, జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు అందుబాటులో ఉండటంతో పాటు ఆయకట్టు రైతులకు అవసరమైన మేర సాగునీటి విడుదల ప్రశాంతంగా సాగుతోంది. ఎటువంటి వరద ముప్పు లేకపోవడంతో పాటు వానాకాలం సాగు పనులకు ఈ జల నిల్వలు ఎంతో ఊరటనిస్తున్నాయి.

కిన్నెరసానిలో నిలకడగా జలమట్టం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని ప్రాజెక్టు వద్ద ప్రస్తుతం నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. పూర్తి స్థాయి నీటి మట్టం 407.00 అడుగులు కాగా, ప్రస్తుతం 405.40 అడుగుల (123.56 మీటర్లు) వద్ద ఉంది. ప్రాజెక్టులో మొత్తం 8.40 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 7.970 టీఎంసీల నీరు ఉంది. అవుట్ ఫ్లో వివరాలు పరిశీలిస్తే ఎల్ఎఫ్ఎంసీ ద్వారా 40 క్యూసెక్కులు, ఆర్ఎఫ్ఎంసీ ద్వారా 30 క్యూసెక్కులు, పవర్ కెనాల్ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద సుమారు 10 వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతోంది. పాల్వంచ, బూర్గంపాడు మండలాల పరిధిలోని పలు గ్రామాలు ఈ ప్రాజెక్టు ఆయకట్టు, సర్‌ప్లస్ కోర్స్ పరిధిలోకి వస్తాయి.

పెద్దవాగు, బయ్యారం ప్రాజెక్టుల పరిస్థితి

అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు వద్ద గేట్లన్నీ మూసివేసినప్పటికీ, ఆయకట్టు రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 81.235 మీటర్లు కాగా, ప్రస్తుత నీటి మట్టం 75.735 మీటర్లుగా ఉంది. మొత్తం 557.89 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 109.68 క్యూసెక్కుల నీరు నిల్వ ఉంది. ఎడమ కాలువ ద్వారా 15, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కులు చొప్పున మొత్తం 45 క్యూసెక్కుల నీరు పంట పొలాలకు వెళ్తోంది. బయ్యారం (లక్ష్మీదేవిపేట) ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 195.38 మీటర్లు కాగా, ప్రస్తుతం 195.072 మీటర్ల వద్ద (15 అడుగులు) నీరు నిలకడగా ఉంది. 397.034 నీటి సామర్థ్యానికి ప్రస్తుతం 354.531 ఎంసీఎఫ్టీ నీరు అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్టు కింద 7,200 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది.

తాలిపేరు ప్రాజెక్టులో పుష్కలం..

తాలిపేరు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్ట్ వద్ద నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువలో ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 74.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 73.96 మీటర్ల వద్ద కొనసాగుతోంది. 730 ఎంసీఎఫ్టీ సామర్థ్యానికి గాను 722.65 ఎంసీఎఫ్టీ నీరు నిల్వ ఉంది. కాలువల అవసరాల నిమిత్తం ఒక గేటును అర అడుగు మేర ఎత్తి 365 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

భరోసా ఇస్తున్న జల నిల్వలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి ప్రాజెక్టుల్లో ప్రస్తుత జల మట్టాలను పరిశీలిస్తే, రాబోయే యాసంగి, ప్రస్తుత వానాకాలం పంటల సాగుకు ఎలాంటి నీటి కొరత ఉండే అవకాశం లేదని స్పష్టమవుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గేజ్ రీడింగ్‌లు, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రాజెక్టుల భద్రతను కాపాడుతున్నారు.

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం వద్ద గోదావరి నది ప్రవాహం ఎలాంటి ప్రమాద హెచ్చరికలు లేకుండా పూర్తిగా సాధారణంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం గోదావరి నీటి మట్టం 7.80 అడుగులుగా నమోదైంది.

కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో మళ్లీ బాంబు కలకలం..

రెండో రోజూ అదే టెన్షన్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వరుసగా రెండో రోజూ బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. ఫుకెట్ కోల్‌కతా ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లు ఒక సందేశం కనిపించడంతో శనివారం అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. ఫుకెట్ నుంచి వచ్చిన విమానం కోల్‌కతాలో సురక్షితంగా ల్యాండ్ అయిన అనంతరం, విమానంలోని టాయ్‌లెట్‌ను శుభ్రం చేస్తుండగా అద్దంపై చేతిరాతతో ఉన్న బాంబు బెదిరింపు నోట్‌ను క్యాబిన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు తక్షణమే ప్రయాణికులందరినీ విమానంనుంచిసురక్షితంగా దించివేశాయి. అనంతరం విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి, సీఐఎస్ఎఫ్, బాంబ్ స్క్వాడ్, ఎయిర్‌పోర్ట్ పోలీసులు సంయుక్తంగా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. గంటల తరబడి సాగిన ఈ సోదాల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభించలేదని అధికారులు ధ్రువీకరించారు. కేవలం భయాందోళనలు సృష్టించేందుకే గుర్తుతెలియని వ్యక్తులు ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని వారు అనుమానిస్తున్నారు. కాగా, శుక్రవారం కూడా విమానాశ్రయ ప్రాంగణంలోని మహిళల వాష్‌రూమ్‌లో ఇలాంటిదే ఒక బెదిరింపు లేఖ లభించింది. అయితే ఆ ఘటనలో కూడా అది బూటకపు బెదిరింపుగానే తేలింది. కేవలం 24 గంటల వ్యవధిలోనే రెండుసార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంతో విమానాశ్రయ అధికారులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రయాణికుల జాబితాను, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ బెదిరింపు నోట్ రాసిన వ్యక్తిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

పదేళ్ల తర్వాత.. ఢిల్లీలో స్వచ్ఛమైన గాలి నమోదు!

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యంపై ప్రభుత్వాలు సాగిస్తున్న పోరాటం సత్ఫలితాలనిస్తోంది. శనివారం నాడు (అక్టోబరు 24) నగరంలో గాలి నాణ్యత సూచీ (AQI) 191 వద్ద 'మోడరేట్' కేటగిరీలో నమోదైందని, ఇది గత దశాబ్ద కాలంలో నమోదైన అత్యుత్తమ గాలి నాణ్యత అని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ప్రకటించారు. కోవిడ్ 19 ప్రభావిత కాలాన్ని మినహాయిస్తే, పదేళ్లలో ఇదే అత్యంత మెరుగైన ఏక్యూఐ అని ఆయన అన్నారు. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వం చేస్తున్న నిరంతర పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. గత గణాంకాలను పరిశీలిస్తే, అక్టోబర్ 24న 2024లో ఏక్యూఐ 306గా, 2025లో 275గా నమోదైందని, ఈ ఏడాదది 191కి తగ్గడం గణనీయమైన పురోగతిని సూచిస్తోందని మంత్రి వివరించారు. కాలుష్య నివారణకు చేపట్టిన స్థిరమైన చర్యలు, కఠినమైన అమలు, వివిధ ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయంతో కూడిన జోక్యం వల్లే ఈ సానుకూల మార్పు సాధ్యమైందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేఖా గుప్తా నాయకత్వంలో ఢిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణకు సమగ్రమైన, కార్యాచరణ ఆధారిత విధానాన్ని అవలంబిస్తోందని సిర్సా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో నిబంధనల అమలు, రెగ్యులర్ తనిఖీలు, జిల్లా స్థాయి సమీక్షలు, టెక్నాలజీ ఆధారిత పర్యవేక్షణ వంటి బహుముఖ వ్యూహాలతో కాలుష్య కారకాలను మూలాల వద్దే అరికట్టడంపై దృష్టి సారించినట్లు చెప్పారు.

ధాన్యం అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక తనిఖీ కేంద్రం



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం అక్రమ రవాణాను అరికట్టి, స్థానిక రైతులకు కనీస మద్దతు ధర అందేలా కాళేశ్వరం అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం పౌరసరఫరాలు, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి ఆయన తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సరిహద్దు దాటి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పోలీసు, పౌరసరఫరాల శాఖల సిబ్బంది సమన్వయంతో 24 గంటల పాటు నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. తనిఖీల్లో నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా, రైతుల ప్రయోజనాలు కాపాడేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్, డీఎం రాములు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలి



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి: ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోవాలని సర్పంచ్ బొల్లెపల్లి రామనాథం గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి,పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 30, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, బీటెక్ పట్టభద్రులు, ప్రభుత్వ ఉద్యోగులు అర్హత నిబంధనలను పరిశీలించి నవంబర్ 6వ తేదీలోపు కొత్త ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. సమీపంలోని ఆన్‌లైన్ కేంద్రంలో దరఖాస్తు చేసుకుని, అవసరమైన గెజిటెడ్ అధికారి సంతకంతో కూడిన పత్రాలను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం పట్టభద్రులు కృషి చేయాలని నాయకులు కోరారు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన రాకేశ్‌రెడ్డి, మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, యువత సమస్యలపై అవగాహనతో మాట్లాడే నాయకుడికి పట్టభద్రులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు పోలంపల్లి ఆనంద్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పిడమర్తి అంజి, 11వ వార్డు సభ్యుడు బడేటి లింగయ్య, వేములూరి నాగేంద్రచారి, కాట్రేవుల అంజి, చింతమల్ల అశోక్, షేక్ సైదా హుస్సేన్, గుండు రమేష్, గూడెపు అమరయ్య, షేక్ ఇస్మాయిల్, షేక్ సలీం, బడేటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సైదోనిగడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): మున్సిపాలిటీ పరిధిలోని సైదోనిగడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని విద్యాశాఖ సూపర్‌వైజర్ సుష్మలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లావుడ్యా శ్రీదేవి రమేష్ శనివారం పరిశీలించారు. కేంద్ర భవనానికి అవసరమైన మరమ్మతు పనులను గుర్తించి, చిన్నారులకు సురక్షితమైన వాతావరణంలో విద్య, పోషకాహార సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్రంలోని మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ స్ఫూర్తితో సమైక్యత దిశగా కాషాయ పార్టీ అడుగులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:స్వతంత్ర భారత నిర్మాణానికి సమర్థ పాలనా దక్షతను చూపిన నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని,ఆయన రాజనీతిజ్ఞత నిరంతర ప్రేరణ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అన్నారు.శనివారం తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో ఈ నెల 31న జరిగే జాతీయ ఏక్తా దివస్ ను పురస్కరించుకొని, 24 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే వారోత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. 544 సంస్థానాలను విలీనం చేసి సమైక్య భారతాన్ని నిర్మించడం పటేల్ జీవితానికి మణికిరీటం అని అన్నారు.వారోత్సవాల్లో భాగంగా జిల్లాల్లో చర్చలు, సదస్సులు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి,31న విజేతలకు బహుమతులు అందజేస్తామని కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేత వద్దిరాజు రామచంద్రరావు, విశ్లేషకులు పాకనాటి దామోదర్ రెడ్డి, శాంత లక్ష్మి,ఐఏఎస్ అకాడమీ అధినేత ఓదెల రవి తదితరులు పాల్గొన్నారు.

అల్ఫాజోలం 'మత్తు'లో కల్లూరు.. కాటేస్తున్న కల్తీ కల్లు

ప్రజాస్ఫూర్తి,ఖైంసా:తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో కల్తీ కల్లు (కృత్రిమ కల్లు) తయారీ మరియు విక్రయాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. కల్లూరు కేంద్రంగా మలుచుకొని పలు గ్రామాలకు సప్లై చేస్తున్నారు గ్రామాలలో సరిపడా తాటి, ఈత చెట్ల నుంచి సహజమైన కల్లు లభించకపోవడంతో, కొంతమంది అక్రమార్కులు మరియు వ్యాపారులు లాభాల కోసం కృత్రిమ పద్ధతుల్లో రసాయనాలతో కల్తీ కల్లును తయారు చేస్తున్నారు.కల్తీ కల్లు ఎలా తయారు చేస్తున్నారు సహజమైన కల్లుకు బదులుగా నీరు, చక్కెర లేదా సాకరిన్ కలిపి, ఎక్కువ మత్తును ఇవ్వడానికి ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగిస్తారు.ఆల్ఫాజూలం డైజోఫామ్ వంటి ప్రమాదకరమైన రసనాలను ఉపయోగించి తయారుచేసిన దీని మూలంగా మానసిక సమస్యలు నిద్రలేమి తగ్గడానికి వైద్యులు ఇచ్చే మందులు వీటికి పరిమితికి మించి కల్లులో కలపడం వల్ల తీవ్రమైన మత్తు వస్తుంది తద్వారా అనారోగ్యం బారిన పడుతున్నారని ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో యూరియా లేదా ఇతర హానికరమైన పౌడర్లను కూడా వాడుతున్నట్లు తనిఖీలు వెలువడవుతున్నాయి కళ్ళు తాగడం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్యం సమస్యల బారిన పడుతున్నారు నరాల బలహీనత నేరుగా కేంద్రనాడి వ్యవస్థ పై దాడి చేస్తే దీనివల్ల చేతులు కాళ్లు వనకడం మతిస్థిమితం తప్పుతుంది క్రమం తప్పకుండా తాగడం వల్ల కాలయం కిడ్నీలో దెబ్బతింటున్నాయి రసాయనాలతో



కూడిన కల్లు తాగడానికి అలవాటు పడిన వారికి అది దొరకకపోతే పిచ్చిగా ప్రవర్తించడం ఫిట్స్ రావడం వంటి లేదా కోమలకు వెళ్లి ప్రమాదం ఉంది మోతాదు ఎక్కువైతే అక్కడికక్కడే అస్వస్థకు గురై మరణించి కేసులు కూడా తెలంగాణ వ్యాప్తంగా ఉన్నట్లు పలు సర్వేలు పేర్కొంటున్నాయి

నిద్రమత్తులో ఎక్సైజ్ శాఖ

గ్రామాల్లో ఇంత ప్రమాదకరమైన స్థాయిలో కల్తీ కళ్ళు తయారవుతున్నప్పటికీ తెలంగాణ ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖలు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయని చెప్పవచ్చు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి మాఫియా పై తగిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యంగా ఉండే విధంగా నాణ్యమైనటువంటి కల్లు ఇచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలి అనిప్రజలు కోరుతున్నారు.

ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి 100 బ్యాగుల సిమెంట్ విరాళం

మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): కిష్టాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి బీజేపీ సీనియర్ నాయకుడు రామన్నగారి శ్రీనివాస్ గౌడ్ 100 బ్యాగుల సిమెంట్‌ను విరాళంగా అందించారు. ఆలయ నిర్మాణానికి సహాయం చేయాలని కిష్టాపూర్-పూడూర్ డివిజన్ ప్రజలు మేడ్చల్-మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరగా, అందులో భాగంగా శ్రీనివాస్ గౌడ్ తన సొంత నిధులతో సిమెంట్‌ను సమకూర్చారు. ఆలయ నిర్మాణ సభ్యురాలు రాములమ్మకు సిమెంట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో గుడి, బడి కీలక పాత్ర పోషిస్తాయని



అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, రతన్ రాథోడ్, గోపు నాగరాజు, ఒగ్గు భాస్కర్, అభినవ్ గౌడ్, చారీ, దొడ్ల మోహన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్ఏ సిబ్బంది ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలి

– జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్..వారు పనిచేసే గ్రామాలలో ప్రతిరోజు ఉదయమే 20 ఇండ్లను సందర్శించి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి మలేరియా, టీబీ నిర్ధారణకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, దానికి సంబంధించిన ప్రతిపాదనలు డిఎంహెచ్ఓ కార్యాలయానికి పంపించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. శనివారం పాల్వంచలోని డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లతో గ్రామాలలో చేపట్టవలసిన కార్యాచరణ గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా పరీక్షలు



జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికి తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత నెలకు సంబంధించిన అన్నిరోగనిరోధక టీకాల కార్యక్రమాలను 100% పూర్తి చేయాలని, మీజిల్స్-రుబెల్లా టీకాల కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, టీకాలు తీసుకోకుండా మిగిలిపోయిన పిల్లలు,మధ్యలో టీకాలు ఆపివేసిన పిల్లలను గుర్తించి, వారికి టీకాలు అందేలా చూడాలని అన్నారు. కుష్ఠు వ్యాధి, క్షయవ్యాధి ప్రచార కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని చెప్పారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా పోలియో వ్యాధి ప్రాముఖ్యత, పల్స్ పోలియో టీకాల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిటిసిఓ డాక్టర్ ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీధర్, పిఓ డిటి డాక్టర్ రాందాస్, ఏఎంఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ - సర్పంచ్ సుధీర్

గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి:రాష్ట్రంలో ఒకవైపు రైతులు కన్నీరు కారుస్తుంటే మరోవైపు నిరుద్యోగులు ఉద్యోగాలకై ఎదురుచూస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వైపు పరుగులు పెడుతున్నారని రామచంద్రపురం సర్పంచ్ బొలిశెట్టి సుధీర్ విమర్శించారు. పొనుగోడులో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా జాబ్ క్యాలండర్ కోసం ఎదురుచూస్తున్న యువత నోటిఫికేషన్లు రాక తమ జీవితమే ఆగం అయిపోతుందని బాధ పడుతున్నారన్నారు. రాష్ట్ర



మంత్రులు ప్రజా సమస్యలు గాలికి వదిలేసి గాలి మోటార్లో తిరుగుతూ ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నారన్నారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి నియంతృత్వ కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మెళ్ళచెరువు వెంకటరమణ, మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, బిల్లా వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ అనంతు కరుణాకర్ గౌడ్, నందిపాటి నరహరి, పంగ నాగయ్య, పొలంపల్లి మహా ఆంజనేయులు,నందిపాటి శ్రవణ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు..

పేదల ఆస్పత్రికి పట్టిన నిర్లక్ష్యం జాడ్యం

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీడియాట్రిక్ వార్డులో సీలింగ్ కూలిన ఘటన నేపథ్యంలో శనివారం వైద్య సేవలు, పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాజీ మంత్రి మాట్లాడుతూ,మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే రోగులు భయాందోళనకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు.చిన్నపిల్లల వార్డులో సీలింగ్ కూలడం ఆందోళనకరమని, ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించి



విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ పేద ప్రజలు నమ్ముకున్న ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని, అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని అన్నారు.

చిలుకూరు గుట్టపై వైభవంగా స్వామివారి కల్యాణం

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని చిలుపుర్ గుట్ట పై కొలువైన శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శని వారం స్వామివారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఆలయ కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని స్వామివారిని దర్శించుకు న్నారు. అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి స్వామివారి కల్యా ణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.భక్తుల భజనలు, పూజా కార్యక్రమాలతో ఆల య ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సం తరించుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బీసీ రాజ్యాధికారానికి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదే కీలకం

*** నవంబర్ 6లోపు అర్హులు నమోదు చేసుకోవాలి: రవి పటేల్**



జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కల్పించాలంటే అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పిలుపునిచ్చారు. నవంబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలని, గతంలో ఓటు వేసిన వారు సైతం జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులు సంబంధిత ధ్రువపత్రాలతో నమోదు చేసుకోవాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల గ్రాడ్యుయేట్లు పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు కావాలని, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్, మోటపోతుల సమ్మయ్య, సురేందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వానల్ పహాడ్ గ్రామంలో నీటి సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన

*** సర్పంచ్ నాగలక్ష్మి వినోద్**




ప్రజాస్ఫూర్తి,ఖైంసా : నిర్మల్ జిల్లా ఖైంసా మండలం లోని వానల్ పహాడ్ గ్రామంలో శనివారం నీటి పొదుపు ,భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృధా నీటిని అరికట్టడం. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ను ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకెలా చేసే పద్ధతులపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏంపెల్లి నాగలక్ష్మి వినోద్, ఉపసర్పంచ్ సాయ రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ గాయత్రి, కారోబారి నారాయణ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై తెర్లుమద్దిలో సిరిసిల్ల డీఎస్పీ విచారణ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఎస్సీ, ఎస్టీ కేసుపై ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి శనివారం విచారణ చేపట్టారు. ఈ నెల 20న రాత్రి తెర్లుమద్ది గ్రామంలో బొడ్రాయి వద్ద డీజే నడుస్తుండగా, దాన్ని ఆపాలని అదే గ్రామానికి చెందిన కొమ్మట మధు అనే వ్యక్తి నిర్వహకులను అడిగాడు. దీంతో గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మధు ఇంటి వద్దకు వెళ్లి మధు, అతని భార్య, అతని సోదరుడుని కొట్టారని శుక్రవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ ఐ జ్యోతికి కొమ్మట మధు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయగా, దీనిపై డీఎస్పీ నాగేంద్ర చారి గ్రామంలో పలువురిని విచారించి, వివరాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.



33వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలోని 33వ వార్డు కౌన్సిలర్ నాగుల వాసు వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాదిలు శంకుస్థాపన చేశారు. కార్యక్రమం లో మున్సిపల్ కౌన్సిలర్ లు నాగుల వాసు, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, పిల్లల రమేష్ నాయుడు , గుణగంటి హేమ సతీష్, నాయకులు అంజద్ అలి, వీరన్న నాయక్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, ఆలేటి మాణిక్యం , అరవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : రైతులకు నాణ్యమైన విత్తనా లు, ఎరువులు, పురుగుమందులు సకా లంలో అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించా రు. శనివారం మండలంలోని బండ్లగూ డెం గ్రామంలో మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి, రైతులకు అంది స్తున్న సేవలు,వ్యవసాయ ఉత్పాదకాల నిల్వలను పరిశీలించారు. ఇప్పటివర కు సుమారు 60 టన్నుల యూరియా తో పాటు ఇతర ఉత్పాదకాలను విక్ర యించి, రూ.19 లక్షల మేర వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్లు కేంద్ర ని ర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. రై తులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పా దకాలు అందిస్తూ, మెరుగైన సేవలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

*** తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన వికారాబాద్ జిల్లా రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్. మహిపాల్ డిమాండ్ చేశారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రూ.2 వేల కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు వికారాబాద్ మండల పరిధిలోని పిరంపల్లి, పులుసుమామిడి, సిద్ధులూరు గ్రామాల్లో రైతు సంఘం జిల్లా బృందం పర్యటించి పంట నష్టాలను పరిశీలించింది.ఈ సందర్భంగా ఆర్. మహిపాల్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, బోర్లలో నీటి కొరత, విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పత్తి, వరి, కంది పంటలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజీ తదితర కూరగాయల పంటలు, పూల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులు దిగుబడులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని కోరారు.నష్టపోయిన పత్తి, వరి, కంది రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున, కూరగాయల పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు పంటల బీమా పరిహారంతో పాటు బోనస్‌లు చెల్లించాలని, బ్యాంకు రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ స్పందించి వికారాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలని, రైతులను ఆదుకునేందుకు రూ.2 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని ఆర్. మహిపాల్ విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందురూపాటి గోపాల్‌రెడ్డి, తేజబాయి శ్రీనివాస్‌తో పాటు రైతులు అశోక్, వేణుగోపాల్, సత్యమ్మ, నర్సమ్మ, వెంకటమ్మ, సుక్కమ్మ, శాంతమ్మ, లక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్, కాకతీయనగర్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి: రా బో యే పట్ట భ ద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వినాయకనగర్, కాకతీయనగర్ డివిజన్లలో బీజేపీ శ్రేణులు పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్ర మాన్ని చేపట్టాయి. వినాయకనగర్ డివిజన్‌లోని మెయిన్ రోడ్డులో బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద, కాకతీయనగర్ డివిజన్‌లోని శివనగర్ ఫేజ్ 1లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టభద్రులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఓటరు నమోదు చేసుకునేందుకు అవసరమైన సహకారం అందించారు. వినాయకనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మితో పాటు ఓం ప్రకాష్, గోపాల్ యాదవ్, మంగేష్, సంతోష్, శంకర్ గౌడ్, శ్రీదేవి, ఉమా మహేశ్వరి, నీలం శ్రీను పాల్గొన్నారు.అలాగే కాకతీయనగర్ డివిజన్‌లోని శివనగర్ ఫేజ్ 1లో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, జగదీశ్ చారి, సోమనాథ్ చారి, వెంకటేష్, తిరుమల, రాములు, మల్లేష్, నరేంద్ర పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మొద్దు.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

*** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల రాజు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రైతులు దళారుల వద్ద తక్కువ ధరకు ధాన్యం విక్రయించకుండా ప్ర భు త్వ కొ ను గో లు కేం ద్రా ల ను ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల రాజు రైతులకు సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ గ్రామంలో సర్పంచ్ మాదాసు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. 202627 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో కేంద్రం నిర్ణయించిన ఎం ఎస్ పీ ప్రకారం ధాన్యం నాణ్యత ఆధారంగా క్వింటాల్‌కు రూ.2,461 వరకు మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామస్థాయిలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు కావడం వల్ల రవాణా భారం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుందని వివరించారు. కొనుగోళ్ల ప్రక్రియలో రాజకీయ జోక్యం ఉండకూడదని, రైతులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని అధికారులను కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ళ బాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి మాట్లాడుతూ పంట సాగు నుంచి విక్రయించే వరకు రైతులు వ్యవసాయ శాఖ మార్గదర్శకాలు, సాంకేతిక సహాయం పొందాలని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో నామాపూర్ సర్పంచ్ మాదాసు అనిల్ కుమార్ ,తహసీల్దార్, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఐకేపీ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో దొంగల ముఠా అరెస్ట్

*** ఏ ఎస్పీ పత్తిపాక సాయికిరణ్**



ప్రజాస్ఫూర్తి, బైంసా :నిర్మల్ జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును భైంసా రూరల్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 170 తులాల వెండి ఆభరణాలు, 13 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.22 వేల నగదుతో పాటు రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. భైంసా ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ పతిపాక సాయి కిరణ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామానికి చెందిన అర్సాల పెద్ద సాయన్న, సంగొల్ల భూమేష్, భుదుబుక్కల గంగన్నతో పాటు నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కాంతం గ్రామానికి చెందిన బైరుపుల పండరి, బైరుపుల కుమార్‌లను నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని భైంసా, ముధోల్, పిప్రి, పెండ్పల్లి, తిమ్మాపూర్, హంపోలికెతో పాటు లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో నిందితులు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు. ఎడ్బిడ్ గ్రామానికి చెందిన ముగ్గురు, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు ఈ ముఠాలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ పతిపాక సాయి కిరణ్ పర్యవేక్షణలో ఈ కేసు దర్యాప్తు సాగింది. భైంసా రూరల్ సీఐ ఎం. ప్రవీణ్ కుమార్, ఎస్ఐ ఎం. సుప్రియతో పాటు ఇతర పోలీసు సిబ్బంది దర్యాప్తులో పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి





*** కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణంపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు సమీక్ష**

జయశంకర్ భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరం క్షేత్రాన్ని సందర్శించిన ఆయన వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్ అన్ని పనులను సమాంతరంగా చేపట్టి, అవసరమైన కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రూపొందించిన ప్రణాళిక, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించడంతో పాటు గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు.వచ్చే నెల 4న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వరం పర్యటనకు రానున్న నేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణాలపై సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణంతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ పర్యటనలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మతో పాటు దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

*** కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి : ఎల్‌నినో ప్రభావంతో వర్షపా తం తగ్గే అవకాశాలున్న నేపథ్యంలో రైతు లు ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సం దీప్ కుమార్ ఝా సూచించారు. శనివా రం లింగాల ఘణపురం మండలం చీటూరు గ్రామంలో నిర్వహించిన ఖేత్ బచావో గ్రామసభలో ఆయన మాట్లాడు తూ వరి సాగును తగ్గించి కంది, శనగ, ఆయిల్‌పామ్, కూరగాయలు, ఉద్యాన వన పంటలు సాగు చేయాలని సూచిం చారు. పాడి పరిశ్రమ, పశుపోషణ, కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. భూగర్భ జలా లను పొదుపుగా వినియోగించుకుం టూ, డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను సద్వి నియోగం చేసుకోవాలన్నారు. నీటి సం రక్షణ కుంటలు, ఫామ్ పాండ్స్ నిర్మా ణంతో పాటు చేపల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు.కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, ఇతర శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ బి. గణేష్, రైతులు పాల్గొన్నారు.

రూరల్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహ బూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ శని వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సంఖ్య, విధుల నిర్వహణ తీరును పరిశీలించి, ప్రజలకు పోలీస్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదుదా రుల సమస్యలపై తక్షణమే స్పందించా లని ఆదేశించారు.ఈకాప్స్ విభాగం, రైటర్స్‌రూమ్,సీసీటీఎన్ఎస్‌పనితీరు,రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈసాక్ష్య వివరాల నవీకరణ, పెండింగ్ కేసులు,ఈ సమన్లు, ఎఫ్ఐఆర్లు, దర్యాప్తు నివేదికలపై రూరల్ ఎస్ఐ పిల్లల రాజుతో చర్చించారు. కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నవీకరించాలని, పెండింగ్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, దర్యాప్తులో నాణ్యత, పారదర్శకత పాటించాలని సూచించారు.

అన్నదానం మహాదానం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర మహాసభ ఈసీ మెంబర్, సుధా బ్యాంకు వైస్ చైర్మన్ , లయన్స్ ఐ హాస్పిటల్ వైస్ చైర్మన్ , రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సూర్యాపేట టౌన్ ఉపాధ్యక్షులు సామాజిక సేవా తత్పరులు కక్కిరేణి చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా సూర్యాపేట కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ కింద టీం ఎంఎన్ ఎల్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో అందరితో సన్నిహితంగా ఉండే నాయకులు, తమకు అత్యంత ఆప్తులైన కక్కిరేణి చంద్ర శేఖర్ జన్మదినం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, వారి జన్మదినం సందర్భంగా సూర్యాపేట పట్టణంలో టీం ఎమ్ ఎన్ ఎల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి పేదలకు అన్నదానం చేయడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్, గుణగంటి సతీష్, జూలకంటి నాగరాజు, యామ సంతోష్, శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ఉపాధి భద్రత కల్పించాలి

*** 3 వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని వీధి వ్యాపారులను ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించవద్దని 3 వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి కోరారు. సుమారు 600 మంది పేదలు, వికలాంగులు, వితంతువులు వీధి వ్యా పారాలపై ఆధారపడి జీవిస్తున్నారని తె లిపారు. వీధి వ్యాపారుల రక్షణ కోసం 2014 చట్టం, తెలంగాణ ప్రభుత్వ జీ.ఓ 89ను అమలు చేయాలని,సమగ్ర సర్వే నిర్వహించి అర్హులకు వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. టౌన్ వెం డింగ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయా లని డిమాండ్ చేస్తూ మున్సిపల్ చైర్ పర్సన్ కడకంచి బాలమణి, కమిషనర్ రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశా రు.కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అండర్17 క్రికెట్ జట్టుకు శ్రీ నలంద విద్యార్థి తనిష్క ఎంపిక

*** తనిష్క్ ను అభినందించిన సీఈవో చైతన్య కృష్ణ**



ప్రజాస్ఫూర్తి, కొత్త గూడెం :ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్17 బాలుర క్రికెట్ జట్టుకు లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ నలంద జూనియర్ కళాశాల విద్యార్థి బి.తనిష్క్ ఎంపిక య్యాడు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన ఎంపికల్లో ప్రతిభ కనబరిచి జట్టులో స్థానం సంపాదించాడు.ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తనిష్క్ సోమవారం నుంచి గద్వాల్‌లో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా శనివారం నలంద వివేకవర్ధిని విద్యాసంస్థల సీఈవో చైతన్య కృష్ణ కళాశాలలో తనిష్క్‌ను ప్రత్యేకంగా అభినందించి, మెమెంటో అందజేశారు. రానున్న పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న తనిష్క్ తనదైన బ్యాటింగ్, బౌలింగ్ శైలితో ఆకట్టుకుంటున్నాడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఏవో రమేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

స్మశాన వాటికలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసిన సర్పంచ్ కొమ్ము కృష్ణ, పాలకవర్గం సభ్యులు



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్: పుట్టెడు దుఃఖంతో స్మశాన వాటికకు వచ్చే బంధువులు, శ్రేయోభిలాషులు, అభిమాన జనం వచ్చి పోతుంటారు. చనిపోయిన వారి అంత్యక్రియల పూర్తి అయినా అనంతరం మంచినీటి కోసం వెతకడం సహజమే. మంచినీటి ట్రాక్టర్ తెప్పించడం గ్రామపంచాయతీ చూసుకుంటుంది. అలాంటి కోవలో నందిగామ గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ఎస్సీ కాలనీలో బోరుబావి త్రవించి మోటర్ బిగించడమే కాకుండా వైకుంఠధామంలో మంచి నీటి ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసి దానికి నల్లాలు బిగించి దహన సంస్కారులకు వచ్చి పోయే వారికి సౌకర్యం కల్పించారు. వాస్తవంగా ఇది నందిగామలో చరిత్ర, ఇదివరలో ఎక్కడలేని విధంగా సర్పంచ్, పాలకవర్గం సభ్యులు ఈ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఊరి ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన వారు సైతం శభాష్ సర్పంచ్ అంటూ ప్రశంసల జల్లు కురిపించడం హాట్ టాపిక్ గా మారింది. శనివారం ఎస్సీ స్మశానవాటికలో జరిగిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్ ప్రారంభ సమావేశంలో ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, బొమ్మగళ్ళ నర్సింలు, మండల వార్డు సభ్యుల సంఘం అధ్యక్షుడు శివగళ్ల సురేష్, కిట్టు, జై భీమ్ అధినేత పద్ధతి కరుణాకర్ ,నాయకులు బొమ్మగళ్ళ లింగం, అభిరామ్ రెడ్డి, బీసా నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు..
మెరుగైన వైద్యం అందించడంలో పీఎం రాహత్ పథకం కీలక పాత్ర

*** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



ప్రజాస్ఫూర్తి ,భైంసా: పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్) పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అనుసంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించడానికి పోలీస్ ఆమోదిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపాయల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాధితుల ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమయంలో వేగంగా స్పందించాలని అన్నారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకొని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. అత్యవసర సేవల కోసం 112, సిసిటిఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానం చేయడం ద్వారా బాధితులకు వేగవంతమైన సేవలు అందుతాయని వివరించారు. ప్రతి జిల్లాలోనూ ఈ పథకం అమలును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలు కాపాడాలన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, రవాణా శాఖ అధికారి దుర్గా ప్రసాద్, వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15న "హలో నేతకాని చలో ఉస్మానియా



ప్రజాస్ఫూర్తి, జన్నారం:రాష్ట్ర ప్రభుత్వం ఆశాస్త్రీయంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఈఅన్యాయం పట్ల నేతకానిలు చేపట్టిన పోరుబాటలో భాగంగా నవంబర్ 15న హలో నేతకాని చలో ఉస్మానియా కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం జరిగిందని ప్రోగ్రాం కన్వీనర్ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత తెలిపారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శనివారం జన్నారం మండల కేంద్రంలో నేతకాని కుల సంఘం మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి సన్నాక సమావేశానికి ప్రసాద్ నేత ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రంగా చేసిన వర్గీకరణలో నేతకానిలు ఏ విధంగా నష్టపోయారో వివరించారు ప్రభుత్వాలు స్పందించే విధంగా తమకు న్యాయం జరిగే దిశగా కార్యక్రమాలు చేపడుతూ నేతకాని సమాజాన్ని చైతన్య పరిచి ఉద్ధృతంగా ఉద్యమాలు నిర్వహించబోతున్నట్లు వివరించారు. దానిలో భాగంగా హలో నేతకాని చలో ఉస్మానియా కార్యక్రమానికి జన్నారం మండల నేతకానికుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తద్వారా చైతన్యవంతమై భవిష్యత్తు ఉద్యమాలకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ డైరెక్టర్ తాల్లాపల్లి రాజేశ్వర్, వైస్ చైర్మన్ బోర్లకుంట ప్రభుదాస్, కో కన్వీనర్ జాడి గంగాధర్, మాజీ ఎంపీపీ కామెరా రవిశంకర్, విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, పట్టణ అధ్యక్షులు దుర్గం వసంత్, సీనియర్ నాయకులు జునుగురి మల్లయ్య, కే భూచ్చాయా, దుర్గం నందయ్య, దత్తు, దుర్గం లక్ష్మీరాజం, వెంబడి భాస్కర్ పెరుగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి: యాసంగి 2026-27 సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచిం చారు. శనివారం జిల్లా సమీక్షిత కలె క్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు విత్తన డీలర్లు, మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జొన్న, వేరుశనగ, మినుము, పెసర, నువ్వులు, పొద్దుతిరుగుడు, శనగ, కుసుమతో పాటు కూరగాయల సాగు ను ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గిం చుకొని రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. డీలర్లు నకిలీ, కాల పరిమితి ముగిసిన విత్తనాలు, ఎరువు లు, పురుగుమందులు విక్రయించ రాదని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. నాణ్య మైన వ్యవసాయ ఉత్పాదకాలను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ అధికారి నూరుద్దీన్, ఏడీఏ లు అపర్ణ, వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారులు, మహిళా రైతు సేవా కేంద్రాల డీలర్లు, 190 మంది ప్రైవేటు విత్తన డీలర్లు పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో రైతులకు ప్రయోజనం

*** ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మొగుళ్లపల్లి మండల రైతు వేదికలో సీఎస్ఆర్ నిధులతో అందజేసిన వ్యవసాయ డ్రోన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో, తక్కువ నీటితో పంటలకు పురుగుమందులు, ఎరువులను సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చన్నారు. రైతులు నేరుగా రసాయనాలతో సంబంధం లేకుండా పిచికారీ చేసుకునే అవకాశం ఉండటంతో ఆరోగ్యపరమైన సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో విస్తృతంగా వినియోగించుకుని రైతులు ప్రయోజనం పొందాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డిసెంబర్ 12న భారీ స్థాయిలో లోక్ అదాలత్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: డిసెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.మురళీ మోహన్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసు,ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత లోక్ అదాలత్ లో మహబూబాబాద్ జిల్లా రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించిందని,ఈ ఏడాది చివరి లోక్ అదాలత్ కావడంతో మెరుగైన ఫలితాలు సాధించాలని అన్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీ పడదగిన కేసులను గుర్తించి, సామరస్యంగా పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. మరిపెడ కోర్టు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసిన అధికారులను అభినందించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారిక యూట్యూబ్ ఛానల్ ను ప్రారంభించారు. ఈ ఛానల్ ద్వారా ఉచిత న్యాయ సేవలు,చట్టపరమైన హక్కులపై అవగాహన కార్యక్రమాల సమాచారం తెలుసుకోవచ్చని కార్యదర్శి స్వాతి మురారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షాలిని షాకెల్లి, జూనియర్ సివిల్ జడ్జిలు కృష్ణతేజ్, దీరజ్ కుమార్, పోలీసు,ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

*** హుస్నాబాద్ లో మెడికల్ షాపులను తనిఖీ చేసిన ఎస్ఐ,పి. లక్ష్మారెడ్డి**



హుస్నాబాద్,ప్రజాస్ఫూర్తి:డాక్టర్ల సూచన మేరకు మాత్రమే మందులు విక్రయించాలని ఎస్ఐ పి. లక్ష్మారెడ్డి మెడికల్ షాపు నిర్వాహకులకు సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రైవేటు మెడికల్ షాపులను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎటువంటి మందులు ఇవ్వకూడదని, ముఖ్యంగా యాంటీ బయాటిక్స్, నిద్ర మాత్రలు, గర్భనిరోధక మాత్రలు వంటి వాటిని ఇష్టానుసారంగా విక్రయించరాదని హెచ్చరించారు.మైనర్లకు మత్తు పదార్థాలు కలిగిన మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, మెడికల్ షాపులో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి మెడికల్ షాపులో లైసెన్స్, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్ తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కొత్తగూడెం సబ్‌డివిజన్‌లో ఏకకాలంలో నాకాబందీ తనిఖీలు

*** అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసుల ప్రత్యేక చర్యలు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, నేరాల నివారణే లక్ష్యంగా కొత్తగూడెం సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శనివారం సాయంత్రం ఏకకాలంలో నాకాబందీ తనిఖీలు చేపట్టారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సాయంత్రం 6గంటల నుంచి ఈ తనిఖీలు నిర్వహించారు.కొత్తగూడెం వన్‌టౌన్ పరిధిలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్, టూటౌన్ పరిధిలోని రామవరం మెయిన్ రోడ్డు, త్రీటౌన్ పరిధిలోని పాత డిపో, లక్ష్మీదేవిపల్లి పరిధిలోని ఇల్లందు క్రాస్‌రోడ్డు, చుంచుపల్లి బైపాస్, సుజాతనగర్ మెయిన్‌రోడ్డు సెంటర్, జూలూరుపాడు పరిధిలోని మాచినేనిపేట క్రాస్‌రోడ్డు, చంద్రుగొండ సెంటర్, అన్నపురెడ్డిపల్లి శివాలయం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం, రోడ్డు ప్రమాదాల నివారణ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించడం, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి

*** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్: మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తన ఓటు హక్కును వినియోగించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన ప్రతి ఒక్కరూ, మీడియా ప్రతినిధులు సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనేందుకు తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన ధ్రువపత్రాలతో ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, తమతో పాటు ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి అర్హ పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాయక్ పురుషోత్తం రెడ్డి బాలరాజ్ గౌడ్ ఇబ్రహీం చందు నాయక్ రాయికల్ శ్రీనివాస్ కుమార్ గౌడ్ చంద్రశేఖర్ బాదేపల్లి సిద్ధార్థ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, కౌన్సిలర్ పెంటయ్య డిప్యూటీ సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటాం

*** కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి,భైంసా :నిర్మల్ జిల్లా మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.శనివారం దిమ్మదుర్తి గ్రామంలో కలెక్టర్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పలు ఇళ్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుంది

*** జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ:పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో శనివారం 1994 సంవత్సరంలో అడవిదేవులపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ నక్సలైట్ల దాడిలో అమరులైన ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకొని, వారికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన పోలీసు వీరుల త్యాగాలు వెలకట్టలేనివని అన్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విధి నిర్వహణలో సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ 15 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పించగలుగుతున్నారని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు ఏ సమస్య ఎదుర్కొన్నా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ రమేష్,నల్గొండ డిఎస్పీ శివరాం రెడ్డి,ఎస్బీ సీఐ నాగరాజు, 2 టౌన్ సీఐ ఆదిరెడ్డి,అడ్మిన్ ఆర్ఐ సంతోష్, 2 టౌన్ ఎస్. ఐ సైదా బాబు,అమరవీరుడు ఎస్ఐ లక్ష్మయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిని కబ్జా చేసిన కూడా పట్టించుకోరా



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:నిరంతరం ప్రజలు రైతులు నడిచే రహదారిని కబ్జా చేసిన అధికారులు పట్టించుకోరా అని విస్తూ పోతున్న రైతు. వివరాల్లోకి వెళితే... మండలంలోని రోటిగూడ గ్రామంలో పంటపొలాలకు ప్రతినిత్యం నడిచేదారిని యదేచ్ఛగా కబ్జా చేశారని దీనిపైన ఎన్నిసార్లు అధికారులకు పిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడంలేదని గ్రామానికి చెందిన అన్నదాత పులిశెట్టి వెంకటేష్ తెలిపారు. శనివారం రోజున అయన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో 324 సర్వే నెంబరు లో గల భూమిని రైతులు పొలాలకు వేల్లెదారిని కబ్జా చేశారని ఈ విషయంలో మండలకేంద్రంలో సోమవారం రోజున జరిగిన ప్రజావానిలో పిర్యాదు చేశానని మండల నీటి పారుదల శాఖా అధికారులకు సైతం తాను పిర్యాదు చేశానని, అయినా కూడా ఎన్ని పిర్యాదులు చేసిన ఎవరు స్పందించడంలేదని అయన అధికారుల తీరుతుంది చూసి విస్తు పోయారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి కబ్జా దారులనుండి రహదారిని రక్షించాలని అయన ఉన్నతాదికారులను కోరారు.

ఏఐ పవర్డ్ రీసెర్చ్ వర్క్‌షాప్ విజయవంతం

*** శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహణ.**



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా:పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ లో అధ్యాపకుల సాంకేతిక,పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'స్కిల్ బిల్డ్ - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూకాక్యాస్టల్ కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అసాది శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరుకాగా, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ గొడ్డేసల శ్రీనివాస్ పాల్గొన్నారు.కార్యక్రమ ప్రారంభంలో అతిథులు, కళాశాల ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తోందని, అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభ్యసించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఎఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ, పరిశోధనా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలపతి మాట్లాడుతూ, అధ్యాపకులు ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ అసాది శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్యం, విద్య, పరిశ్రమ, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ అకాడమిక్స్ డాక్టర్ సుదర్శన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ &రీసెర్చ్ ఇన్నోవేషన్ హెడ్ డాక్టర్ మురళి మోహన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి,ట్రైనింగ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్,డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పదిలో ప్రధమ శ్రేణి వస్తే ఢిల్లీ పర్యాటన

*** కలెక్టర్ బి చంద్రశేఖర్**



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ :నల్గొండజిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థులు పరీక్షలో ప్రథమ ర్యాంకులు సాధిస్తే రాష్ట్రరోళ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన సొంత ఖర్చులతో ఢిల్లీ పర్యటనకు తీసుకెళ్లనున్నారని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. విమాన ప్రయాణ ఖర్చులతో పాటు, ఇతర ఖర్చులు, షాపింగ్ ఖర్చులను కూడా ఆర్ అండ్ బి శాఖ మంత్రి భరిస్తారని, ఢిల్లీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తారని చెప్పారు.శనివారం జిల్లా కలెక్టర్ బొట్టు గూడా లోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు,మౌలిక సదుపాయాలను పరిశీలించారు. 7 తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, విద్య పురోగతి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా బోధిస్తున్నారని? చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు బాగా బోధిస్తున్నారని, తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు.అనంతరం పదవ తరగతిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. రిఫ్లెక్షన్, నాన్‌రిఫ్లెక్షన్‌కు సంబంధించిన అంశాలపై ప్రశ్నించగా, విద్యార్థులు బోర్డుపై సమాధానాలను వివరించిన తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు .8,9,10 తరగతుల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ ను ఆదేశించారు. తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ప్రతి విద్యార్థికి నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించి మెరుగైన మార్కులు సాధించేలా బోధన అందించాలని చెప్పారు. విద్యార్థుల పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి, వారి అభ్యసన స్థాయిని అంచనా వేశారు.మూత్రశాలలు పరిశీలించిన కలెక్టర్, నీటి కుళాయిల్లో లీకేజీలు లేకుండా చూడాలని, అవసరమైన చోట కొత్త కుళాయిలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి వృథాను అరికట్టేందుకు పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు.ఈకార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రామాచారి,ఎంఈఓ అరుంధతి, ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, సుధారాణి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు .

చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

ప్రజా స్ఫూర్తి , షాద్‌నగర్:షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. శని త్రయోదశిని పురస్కరించుకొని భక్తులు నవగ్రహాలకు అభిషేకాలు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు,రాఘవేంద్రాచార్య,అర్చకులు, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో



భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం కాశిరెడ్డిగూడ గ్రామానికి చెందిన లింగారం నాగయ్య గౌడ్, సావిత్రి కుమారులు లింగారం నందరాజ్ గౌడ్ ,భార్య స్వాతి కూతురు శ్రీనిక, కుమారుడు ఆర్యన్, రెండవ కుమారుడు లింగారం రాఘవేంద్ర గౌడ్,భార్య సౌమ్య కుతురు లింగారం సితార స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేసిన లింగరం నాగయ్య గౌడ్ సావిత్రి కుటుంబ సభ్యులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, ఎంసాని నరసింహులు, జి.వసంతరావు, అన్నారం రఘు గౌడ్, శ్రీశైలం యాదవ్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, నరహరి, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్ రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన పోలీస్ 'ఓపెన్ హౌస్'

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు, పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా గరిడేపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసు శాఖ విధులు, నేర పరిశోధన విధానాలు , ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై స్థానిక సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)బి.శ్రీకాంత్ గౌడ్ సమగ్ర అవగాహన కల్పించారు.

*** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే నేరాల ఛేదన**

ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. పోలీసు విధివిధానాలు, నేరాల పరిశోధనలో పాటించే శాస్త్రీయ పద్ధతులు,సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యత గురించి వివరించారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, బాలల రక్షణలో పోలీసు శాఖ పోషిస్తున్న కీలక పాత్రను తెలియజేశారు. కేసుల పరిశోధనలో కమ్యూనికేషన్ వ్యవస్థ, ఫింగర్‌ప్రింట్ (వేలిముద్రల) పరికరాల



పనితీరు, నేరస్థుల డేటాబేస్ నిర్వహణ ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. నేరాల నియంత్రణ మరియు నిందితులను త్వరితగతిన పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికత అత్యంత కీలకమని పేర్కొన్నారు.

*** అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం**

ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్ఐ పిలుపునిచ్చారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించాలని, సంస్మరణ కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పోలీసుల త్యాగాలు, విధుల పట్ల సమాజంలో సరైన అవగాహన కల్పించడమే ఈ 'ఓపెన్ హౌస్' ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు శ్రీ వాసవి విద్యా ట్రస్ట్ ఆర్థిక సహాయం




హైదరాబాద్,ప్రజాస్ఫూర్తి: పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉన్నత విద్యలో అండగా నిలుస్తున్న శ్రీ వాసవి విద్యా ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ట్రస్ట్ ఐదో వార్షికోత్సవ వేడుకల్లో 63 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు ముఖ్య అతిథిగా, గంప నాగేశ్వరరావు, మోటివేషనల్ స్పీకర్ అవినాష్ బ్రహ్మదేవర గౌరవ అతిథులుగా హాజరయ్యారు.గత నాలుగేళ్లలో 42 మంది విద్యార్థులకు విద్యా సహాయం అందించామని, ప్రతి సంవత్సరం రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు కళాశాల ఫీజుల రూపంలో సహకరిస్తున్నామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ట్రస్ట్ సహకారంతో చదువుకున్న ముగ్గురు విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం సంతోషకరమన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దుబ్బ అనిల్ కుమార్, శాశ్వత గౌరవాధ్యక్షుడు కొత్తమాసు మురళీధర్, వ్యవస్థాపక అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, కోశాధికారులు, కార్యవర్గ సభ్యులు, దాతలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.సుమారు 700 మంది హాజరై ట్రస్ట్ సేవలను అభినందించారు.

ఎల్‌నినో ప్రభావం..

ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

*** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, సీనియర్ నేత కృష్ణారెడ్డి**



ప్రజాస్ఫూర్తి ,షాద్‌నగర్:ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి, సీనియర్ నేత కృష్ణారెడ్డి సూచించారు. కొందుర్గు మండల రైతు వేదిక వద్ద సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోగురి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. కొందుర్గు మండలంలో ఎన్‌బీఈజీ 47 రకం శనగ విత్తనాలు 7.5 క్వింటాళ్లు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్వింటాలు విత్తనాల అసలు ధర రూ.10 వేలుగా ఉండగా,ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో రూ.6 వేలకే అందిస్తోందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు సమర్పించి విత్తనాలు పొందాలని సూచించారు.కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, వర్షాల అసమాన పంపిణీ, మారుతున్న వాతావరణ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, టేకులపల్లి సర్పంచ్ శ్రీశైలం, గ్రామ అధ్యక్షుడు కడిగాళ్ల మహేందర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ భీమారం మనయ్య, జీబీ కృష్ణ, బోరిగా నరేందర్, దుర్గాని శ్రీను, తీగలపల్లి గోపాల్, రాజేందర్ గౌడ్, రామచంద్ర రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, శ్రీను, రమేష్, నర్సింలు, సల్వారెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదాన కార్యక్రమం

*** రక్తదానం మహాదానం**
– జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ:పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రక్తదాన కార్యక్రమాలు నిర్వహించగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రధాన ఉద్దేశం దేశం కోసం, ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన వారి త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి స్ఫూర్తితో నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు.రక్తదానం చేయడం వల్ల సమాజానికి సేవ చేయడంతో పాటు మానవత్వాన్ని చాటుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి మరింత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యంగా ఉన్న అర్హులైన వ్యక్తులు వైద్యుల సూచనల మేరకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల మరొకరి కుటుంబంలో ఆనందాన్ని నింపడంతో పాటు, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందించినవారమవుతామని తెలిపారు.పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, ఇతర యువతను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్పీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, నాగరాజు, శ్రీను నాయక్, మంజుల, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ తండాలో వైద్యశిబిరం విజయవంతం..



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూసుమంచి మండలం ఎర్రగడ్డ తండా గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతం అయినట్లు సోమ్లా నాయక్ వారి కుమారులు హత్యా నాయక్, శ్రీనివాస్ లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీ రంగ రాజన్ శ్రీనివాసం అనురాధ దంపతులు గత 18 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తూ అవసరమైన మందులు అందిస్తున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభవాలను గెలుచుకొని సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ వారు మా కుటుంబం మీద ఉన్న గౌరవంతో మా కోరికను మన్నించి మా అమ్మ గారైన బుచ్చమ్మ 23వ వర్ధంతి సందర్భంగా ఎర్రగడ్డ తండ గ్రామంలో సోమ్లా నాయక్ వారి కుమారులు బానోతు హత్య నాయక్, శ్రీనివాస్, వారి మనవళ్ళు ప్రవీణ్ కుమార్,ప్రశాంత్ కుమార్ రాహుల్ రాజ్ అర్జున్ తేజ్ వారి అల్లులు మోతిలాల్ అమ్రు కుటుంబ సభ్యులు ఇతర గ్రామాలకు కూడా వైద్య బృందంచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అందరికీ కావలసిన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సంబంధించిన 100 రకాల ఉచిత మెడిసిన్, సంవత్సరానికి సరిపడా మెడికల్ కిట్స్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాజా, శ్రీనివాసన్, పవన్, నరసింహ రావు ,సత్య, నందన్, శ్రీనాథ్ శ్రీకాంత్, శర్మ, అమర్,డాక్టర్లు అశోక్, కళ్యాణ్, నిషా, విజయ్ చందర్, శ్రీనివాస్ రావు, సాయికుమార్ వారి వైద్య బృందం, గ్రామ పెద్దలు మాజీ జెడ్పిటిసి రామచంద్రు నాయక్, రమేశ్ గూగులోత్, శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, నీలకంఠం,రాజు,రంగ, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టికి భూమిపూజ




*** డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తతో ఎరువుల తయారీకి శ్రీకారం**

జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణ పురపాలక సంఘం పరిధి లోని డంపింగ్ యార్డు లో తడి, పొడి చెత్తను వేరు చే సి, వాటి ద్వారా భూమికి మేలు చేసే సేంద్రియ ఎరువులను తయారు చేసేం దుకు భూమిపూజ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణంలో పేరుకు పోతున్న చెత్తను సమర్థవంతంగా విని యోగించుకోవడంతో పాటు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. చెత్తను వన రుగా మార్చి సేంద్రియ ఎరువుల తయా రీని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురపాల క అధికారులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని మద్దతు ధర

*** ఐకేపి డిపిఎం రమేష్ బాబు..**



అందోలు,ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని ఐకెపి డిపిఎం రమేష్ బాబు అన్నారు. అందోలు మండల పరిధిలోని మాసానిపల్లిలో శనివారం ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతోపాటు పలు గ్రామాల్లో 8 సెంటర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే రమేష్ బాబు గారు పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల వ్యవధిలో అమ్మిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు రైతుల అకౌంట్ లో జమ కావడం జరుగుతుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2461,బి గ్రేడ్ రకానికి ధర రూ.2441 అదేవిధంగా సన్నారకానికి బోనస్ గా క్వింటాలుకు రూ.500 రూపాయల చొప్పున మొత్తం రూ.2961 రూపాయలు చెల్లించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అశోక్, అక్సన్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ జి.నరేందర్ రెడ్డి , జి. శ్రీనివాస్ రెడ్డి, శివచందర్,మధుసూదన్ రెడ్డి , సర్పంచులు సత్యనారాయణ, రవీందర్, అనిత రమేష్, మల్లీశ్వరి విజయ్, మల్లేశం, మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్, జనార్ధన్, ఐకెపి సిసి లు సత్యనారాయణ, మల్లేశం, నవరాణి, రామయ్య, లక్ష్మణ్, పలు గ్రామాల గ్రామ సంఘం అధ్యక్షురాలు వివోఏలు, రైతులు పాల్గొన్నారు.

నాగార్జున హై స్కూల్ లో ఘనంగా ఐక్య రాజ్య సమితి 81వ ఆవిర్భావ దినోత్సవం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి:ఐక్య రాజ్య సమితి 81వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జగద్గిరి గుట్ట డివిజన్,మద్దుమ్ నగర్ లోని నాగార్జున హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో. ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ఏర్పడ్డ సంస్థ ఐక్య రాజ్య సమితి అన్నారు.193 దేశాలు సభ్యత్వం కలిగి ఉన్న సంస్థ,ఈ సంస్థ ప్రపంచ శాంతి కొరకు,యుద్ధ నివారణ కొరకు,పేదరిక నిర్మూలన కొరకు,అరోగ్యం,సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం పని చేస్తుంది అన్నారు.పాఠశాల కరెస్పాండంట్ బి కిషన్ రావు మాట్లాడుతూ తటస్థంగా ఉండాల్సిన సంస్థ ఒక వైపు ఉండడం వల్ల ప్రపంచ శాంతి కుంటూపడుతోంది అన్నారు.కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ తూటే విజయ్ కుమార్,సాయి ప్రతాప్,వెట్రెక్స్ సందీప్ బల్లెం,శ్రీనివాస్ గౌడ్,అడ్వకేట్ శ్రీనివాస్,పాఠశాల డైరెక్టర్ నవీన్ కుమార్,ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

మనిషిని మనిషితో సంభాషింప చేసేది కేవలం ఒక్క నాటక కళ మాత్రమే



ప్రజాస్ఫూర్తి,ఖమ్మం జిల్లా : నెలనెలా వెన్నెల 111వ నెల కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు బోసకల్లు మండలం రావినూతల గ్రామ వాస్తవ్యులు అమరజీవి యనమదల జోషి చిత్రపటానికి వారి కుటుంబ సభ్యులు ,వారి తమ్ముడు యనమదల మురళి , నిర్వాహకులు , టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే రంజాన్ టిపిఎస్కే జిల్లా కన్వీనర్ పారుపల్లి ఝాన్సీ కుమారి తదితరులు ఘనంగా నివాళులర్పించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యనమదల జోషి సాయుధ పోరాటంలో బోనకల్లు ప్రాంతంలో వారి సేవలు విశేషమైనదని ప్రత్యేకించి తను మార్క్సిస్టు పార్టీ ఉద్యమానికి అండగా నిలిచారని వారి తమ్ముడు యనమదల మురళి వారి కుమారుడు వై విక్రం వారి బాటలోనే ప్రస్తుతం ఉద్యమాల్లో కొనసాగుతున్నారని వారిని సందర్భంగా స్మరించుకోవడం సముచితమని వారికి జోహార్లు అర్పించారు. అనంతరం నాటకం ప్రారంభానికి ముందు ప్రముఖ జాతీయ దర్శకులు మన ఖమ్మం వాస్తవ్యులు అయినటువంటి దెంచనాల శ్రీనివాస్ నాటకాన్ని పరిచయం చేస్తూ ప్రపంచంలో అనేక కళలు సాహిత్యం ఉన్నప్పటికీ ఈ ప్రపంచంలోనే మనిషిని మనిషితో సంభాషింప చేసేది కేవలం ఒక్క నాటక కళ మాత్రమే అని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై వీక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్ మోటమర్రి జగన్మోహనరావు కే దేవేంద్ర వేముల సదానంద్ , దర్శకులు శ్రీనివాస్ స్నేహితులు,పట్టణ ప్రముఖులు, యాంకర్ రవీందర్, ఉపేందర్ లింగయ్య వీరబాబు శశి తదితరులు పాల్గొన్నారు

ప్రజా ప్రభుత్వం గోదాముల నిర్మాణం రైతన్నకు అండగా నిలుస్తోంది

*** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ ఉంచుకునేందుకు ప్రజా ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపడుతూ రైతన్నకు అండగా నిలుస్తోందని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న10 వేల మెట్రిక్ టన్నుల



సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఆత్మకూరు మండల రైతులకు ఉపయోగపడేలా భారీ సామర్థ్యంతో గోదాము నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. రైతులు పండించిన ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు సరైన వసతులు లేక రహదారులపై ఆరబెట్టాల్సి వస్తోందన్నారు. రైతులకు ఇటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిల్వ సదుపాయాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. గిడ్డంగుల సంస్థ అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేసి ఆరు నెలల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది, ఎఫ్ సి ఐ ఎండి లక్ష్మి, ఎస్ ఇ శ్రీనివాస్, డి ఇ రోహిణి , కాంట్రాక్టర్ వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు రామచంద్రారెడ్డి, కోతి గోపాల్ రెడ్డి,ధరావత్ వీరన్న నాయక్, దండి రమేష్, అబ్దుల్ రహీం, పచ్చిపాల వెంకన్న, తంగేళ్ల కరుణాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, గుణగంటి సతీష్, పురుషోత్తం, సర్పంచ్ పాటి కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలి

*** ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్**



ప్రజాస్ఫూర్తి.నల్లగొండ: నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని, కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం (ఇందిరా భవన్) లో నల్లగొండ నియోజకవర్గకాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులంతా కృషి చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.పట్టభద్రులను ప్రత్యక్షంగా కలిసి నమోదు ప్రక్రియ వివరాలను తెలియచేయడంతో పాటు అర్హతలు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానంపై అవగాహన కల్పించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి దీనిని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామాలు, పట్టణాల వరకు నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా బాధ్యతలు తీసుకుని ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు.యువత, నిరుద్యోగ పట్టభద్రులతో విస్తృతంగా మమేకం కావాలని,వారి సమస్యలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించాలన్నారు. అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటరు నమోదుకు దూరం కాకుండా చూడాలని తెలిపారు.ఓటరు నమోదు విషయంలో పట్టభద్రులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసి, సరైన సమాచారాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు.ఓటరు నమోదు నుంచి ఎన్నికల ప్రచారం వరకు ప్రతి దశలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.నవంబర్ 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ ఉన్నందున పార్టీలోని ప్రతి ఒక్కరు దీనిలో భాగస్వాములై వేగవంతం చేయాలని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు పోతుందన్నారు. నగర మేయర్ బుర్రి వైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందంజలో ఉండాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ అభివృద్ధి చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్ష వహించిన నల్గొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదును వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, నల్లగొండ, కనగల్ మాజీ జెడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప రెడ్డి, తిప్పర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాదూరి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగుల సైదులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఆర్టిఏ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిడి కార్తీక్, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పాదం అనిల్,ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి,పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా మట్టి తరలింపు.. ఆందోళనలో గ్రామస్తులు

*** మట్టి అక్రమ తరలింపుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: యువ నేత రాత్లావత్ గోపాల్ నాయక్**



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నప్పటికీ, కొందరు స్వార్థపరుల చర్యలతో విలువైన మట్టి కనుమరుగవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా మట్టిని తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ భూములైనా, ప్రైవేటు భూములైనా తమకు అనుకూలంగా ఉంటే చాలు.. ఎలాంటి నిబంధనలతో సంబంధం లేకుండా తవ్వకాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆవేదనతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పోల్కొనిగుట్ట తండా శివారులోని వి.వి. ఆర్. వెంచర్ పరిధిలో సర్వే నంబర్ 33లో ప్రభుత్వానికి కేటాయించిన స్థలంలో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే తవ్వకాలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు గ్రామస్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. మట్టిని తరలిస్తున్న కేటుగాళ్ళ పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.విలువైన మట్టిని తరలించడం వల్ల భూమి స్వరూపం మారడమే కాకుండా, భవిష్యత్తులో పలు సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు మట్టి తవ్వకాలు, తరలింపుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ యువనేత రాత్లావత్ గోపాల్ నాయక్‌తో పాటు ఎం.శంకర్,ఎం.రమేష్,ఎం.తారాసింగ్, కె.శంకర్, ఆర్.శివకుమార్, వి.లాలు, ఆర్.గణేష్, ఆర్.గోపాల్, ఎం.లాలు, ఆర్.పుల్యా తదితర గ్రామస్తులు సంబంధిత గ్రామ తహసీల్దార్, గ్రామ పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.మరోవైపు, గ్రామ పంచాయతీ అధికారి ప్రశాంతి ఈ వ్యవహారంపై కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో మట్టి తరలింపు వ్యవహారం అధికారుల దృష్టికి చేరింది. ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

*** అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి: యువ నేత గోపాల్ నాయక్**

ప్రభుత్వ భూముల్లో అక్రమాలకు పాల్పడినా, అనుమతులు లేకుండా మట్టిని తరలించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ యువ నేత రాత్లావత్ గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ప్రజా సంపదకు నష్టం కలి గించే చర్యలను ఉపేక్షించకూడదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సర్వే నంబర్ 33 పరిధిలో జరుగుతున్న తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామ స్తులు కోరుతున్నారు. తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను పరిశీలించి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించేనా?ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు సకాలంలో స్పందించకపోతే చివరకు గ్రామస్తులే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, మట్టి తరలింపు వ్యవహారంపై విచారణ జరిపి,వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.మట్టి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడుతుందా? బాధ్యులపై చర్యలు ఉంటాయా? లేక గ్రామస్తుల ఫిర్యాదులు కాగితాలకే పరిమితమవుతాయా? అన్నది వేచి చూడాలి.

అకస్మాత్తుగా స్పృహ కోల్పోతే నిర్లక్ష్యం వద్దు

*** యశోదా ఆసుపత్రి వైద్యులు సాయిజ్ కృష్ణన్, ఆదిత్యల సూచన**



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ :అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం అనేది తీవ్రమైన నాడీ సంబంధిత న్యూరోలాజికల్ అత్యవసర పరిస్థితికి సంకేతమని, ఇలాంటి సమయాల్లో ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించి చికిత్స అందించాలని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సాయిజ్ కృష్ణన్, ఆదిత్యలు సూచించారు. శనివారం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా. సాయిజ్ కృష్ణన్ ఎస్, ఆదిత్య మాట్లాడుతూ షాద్‌నగర్‌కు చెందిన 76 ఏళ్ల వృద్ధుడు అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించారని, అక్కడ సీటీ స్కాన్ చేయగా మెదడు కుడివైపు థాలమస్ ప్రాంతంలో భారీగా రక్తస్రావం జరిగి, అది వెంట్రికల్స్‌లోకి విస్తరించి ‘హైడ్రోసెఫలస్’ కు దారితీసినట్లు గుర్తించారన్నారు. స్పృహ స్థాయి తగ్గి పక్షవాతం లక్షణాలు కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం మా ఆసుపత్రికి రావడం జరిగిందన్నారు.రోగి పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వెంటనే రైట్ ఫ్రంటల్ బర్ హోల్ ప్రక్రియ నిర్వహించి యాంటీబయాటిక్ పూతతో కూడిన ఎక్స్‌టర్నల్ వెంట్రిక్యులర్ డ్రెయిన్ అమర్చామన్నారు. దీని ద్వారా మెదడుపై ఉన్న ఒత్తిడిని, పేరుకున్న ద్రవాన్ని బయటకు మళ్లించడంతో హైడ్రోసెఫలస్ తగ్గిందన్నారు.రోగికి గతంలో ఇస్కీమిక్ స్ట్రోక్ చరిత్ర ఉండటంతో ఈ చికిత్స సవాలుగా మారిందన్నారు.రోగిని ఇంటెన్సివ్ కేర్ లో ఉంచి నిరంతరం పర్యవేక్షించి, మెదడు వాపు తగ్గేందుకు, మూర్ఛ రాకుండా మందులతో పాటు శ్వాస సహాయక చికిత్స అందించామన్నారు. దీర్ఘకాలిక శ్వాస సహాయం అవసరం కావడంతో శ్వాసనాళానికి ట్రాకియోస్టమీ నిర్వహించడం వల్ల వెంటిలేటర్ మద్దతును తగ్గించగలిగాం అని వారు పేర్కొన్నారు. చికిత్స సమయంలో రోగికి పెరిగిన తీవ్ర రక్తపోటును కార్డియాలజిస్ట్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్స్ సమన్వయంతో పర్యవేక్షించి తగిన వైద్యం అందించామని మీడియా కు తెలిపారు. బహుళ వైద్య విభాగాల సమన్వయంతో రోగి ఆరోగ్య పరిస్థితి స్థిరపడిందన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయానికి రోగి మేల్కొలిపినప్పుడు స్పందిస్తూ వైద్యుల ఆదేశాలు పాటించే స్థితికి వచ్చారని డాక్టర్లు తెలిపారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు తదుపరి ట్రాకియోస్టమీ సంరక్షణ,ఫిజియోథెరపీ, నాడీ సంబంధిత పునరావాసం కోసం రోగిని పునరావాస కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు.

నిపుణుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

రక్తస్రావం లేదా తీవ్ర నాడీ సంబంధిత సమస్యలు తలెత్తితే అత్యవసర చికిత్సతో పాటు, శస్త్రచికిత్స అనంతరం నిపుణుల వైద్య పర్యవేక్షణ, పునరావాస చికిత్స నిరంతరాయంగా కొనసాగించడం ఎంతో ముఖ్యమని వైద్యులు స్పష్టం చేశారు.అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం, శరీరం ఒకవైపు పక్షవాతానికి గురికావడం, మాట తడబడటం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే సీటీ స్కాన్ సౌకర్యం, న్యూరో సర్జరీ విభాగం ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. బీపీ ఉన్నవారు, పక్షవాతం గురై రక్తం పలచబడే మందులు వాడేవారు బిపిని నిరంతరం నియంత్రణలో ఉంచుకోవాలన్నారు.అధిక రక్తపోటు వల్ల మెదడులో రక్తనాళాలు పగిలే ప్రమాదం ఉంటుందన్నారు.మెదడు శస్త్రచికిత్స లేదా తీవ్ర నాడీ సంబంధిత సమస్యల నుండి కోలుకునే క్రమంలో ఫిజియోథెరపీ, ట్రాకియోస్టమీ సంరక్షణ మరియు సరైన పునరావాస చికిత్సను కొనసాగించడం ఎంతో అవసరమని వైద్యులు స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధి ఎ. వాసుకిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజులు పని పొందాలి

*** విబిజి రామ్ జీ పథకంతో పేదలకు ఆర్థిక భరోసా**

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి, భైంసా :వివిజి రామ్ జీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు పొందాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.పంటల దిగుబడి తగ్గడం,వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితుల్లో ఈ పథకం గ్రామీణ పేదలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని తెలిపారు.కడెం మండలం కొండుకూరు గ్రామంలోని ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన జోన్-1 స్థాయి వివిజి రామ్ జీ అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ 125 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పథకం కింద చేపట్టే పనులకు కూలీ డబ్బులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి వంటి పనులను చేపట్టడం ద్వారా ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజల వద్దకే వెళ్లి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలని సూచించారు.కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు సందీప్, తుకారాం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

MOVIE TIME



కీర్తి సురేష్ రికార్డు రెమ్యూనరేషన్

క్రైమ్ డ్రామా వెబ్‌సిరీస్ అక్క కోసం కీర్తి సురేష్ తీసుకున్న రెమ్యూనరేషన్ బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సిరీస్ కోసం ఈ తమిళ బ్యూటీ ఆరు కోట్ల పారితోషికం స్వీకరించినట్లు చెబుతోన్నారు. కీర్తి సురేష్ కెరీర్‌లో ఇదే హయ్యెస్ట్ అని టాక్ వినిపిస్తోంది. అక్క వెబ్‌సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. యాక్షన్ రోల్‌లో కీర్తి కనిపించడం ఇదే మొదటిసారి. యాక్షన్ సన్నివేశాల్లో పర్‌ఫెక్షన్ కోసం కీర్తి గన్ షూటింగ్‌తో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో ట్రైనింగ్ కూడా తీసుకుంది. డైలాగ్ డెలివరీపై విమర్శలు వచ్చే అవకాశం ఉండటంతో హిందీ యాసను పర్‌ఫెక్ట్‌గా పలకడంలో శిక్షణ తీసుకొని ఈ సిరీస్‌కు డబ్బింగ్ చెప్పినట్లు ఆమె పేర్కొన్నది.

కొత్త ఏడాదిలో సెట్స్‌పైకి మైథాలజీ మూవీ

రణబాలి సక్సెస్‌తో జోష్ మీదున్న విజయ్ దేవరకొండ హీరోగా హాయ్ నాన్న ఫేమ్ శౌర్యువ్ దర్శకత్వంలో ఓ మైథాలజీ థ్రిల్లర్ మూవీ రాబోతుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జనవరి నుంచి ప్రారంభం కానున్నట్లు వార్తలొస్తున్నాయి. పురాణాలకు నేటి కాలాన్ని ముడిపెడుతూ రివేంజ్ యాక్షన్ డ్రామాగా దీనిని రూపొందించబోతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ మూవీ ఓపెనింగ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. నవంబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టాలని ప్లాన్ చేశారు. కానీ రణబాలి, రౌడీ జనార్ధన షూటింగ్‌లు ఆలస్యం కావడంతో ఆ ఎఫెక్ట్ ఈ మూవీపై పడింది. మైథాలజీ రోల్ కోసం విజయ్ స్పెషల్‌గా మేకోవర్ కాబోతున్నట్లు సమాచారం. అతడి లుక్, క్యారెక్టరైజేషన్ గత సినిమాలతో పోలిస్తే చాలా భిన్నంగా ఉంటుందని అంటున్నారు. మైథాలజీ ఎపిసోడ్స్ హైలైట్‌గా ఉండబోతున్నట్లు సమాచారం.





అందుకే ప్రమోషన్లకు దూరమా?

రణబీర్‌కపూర్, సాయిపల్లవి జంటగా నటించిన రామాయణ మూవీ నవంబర్ 5న థియేటర్లలోకి రాబోతుంది. కేజీఎఫ్ ఫేమ్ యశ్ కీలక పాత్రలో నటిస్తోన్న ఈ సినిమాకు నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. రామాయణ గాథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాలో రకుల్ ప్రీత్ సింగ్, సన్నీడియోల్, లారా దత్తాతో పాటు పలువురు బాలీవుడ్ యాక్టర్స్ ప్రధాన పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ మైథాలజీ మూవీలో యశ్‌కు జోడీగా కాజల్ అగర్వాల్ కనిపించబోతుంది. రన్‌టైమ్ సమస్యల కారణంగా ఈ మైథాలజీ మూవీ నుంచి కాజల్ అగర్వాల్ సీన్లను చివరి నిమిషంలో కట్ చేశారని వార్తలొస్తున్నాయి. మేకర్స్ నిర్ణయంతో హర్టయిన ఈ అందాల చందమామ కావాలనే రామాయణ ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటుందని అంటున్నారు. సోషల్ మీడియాలో ఈ సినిమాను ఉద్దేశించి ఎలాంటి పోస్ట్‌లు పెట్టడం లేదు కాజల్.



గోపీచంద్ సరసన మలయాళ బ్యూటీ

గోపీచంద్ సింగ షూటింగ్‌పై మేకర్స్ అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ రివేంజ్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ మూవీ షూటింగ్ సగం వరకు పూర్తయినట్లు వెల్లడించారు. ఫైట్ మాస్టర్ వెంకట్ డైరెక్టర్‌గా పరిచయమవుతోన్న ఈ సినిమాతో మలయాళ బ్యూటీ అనార్కలి నజర్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుంది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో గిరిజన తెగ పోరాటంతో సింగ రూపొందుతోంది. ఇందులో ట్రైబల్ తెగకు చెందిన యోధుడిగా గోపీచంద్ కనిపించబోతున్నట్లు సమాచారం. అనార్కలి నజర్ ఈ సినిమాతోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. మలయాళంలో ఆరాట్టు, మోహన్ కుమార్ ఫ్యాన్స్, రోమియోతో పాటు మరికొన్ని సినిమాలు చేసింది. సింగలో అనార్కలి ఓ డీగ్లామర్ పాత్రలో కనిపించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.

భర్తతో బాక్సాఫీస్ వద్ద పోటీ

భర్త నాగచైతన్యతో అక్కినేని కోడలు శోభిత ధూళిపాళ బాక్సాఫీస్ వద్ద పోటీపడబోతుంది. ఒకే రోజు భార్యాభర్తల సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నట్లు వార్తలొస్తున్నాయి. తమిళంలో వెట్టువమ్ పేరుతో సైన్స్ ఫిక్షన్ కథతో తెరకెక్కుతోన్న సినిమాకు పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. నెగెటివ్ షేడ్స్‌తో యాక్షన్ ప్రధానంగా సాగే పాత్ర కోసం మల్ల ఖంభం, అది మురై కలరిపయట్టు వంటి ప్రాచీన యుద్ధ కళలను నేర్చుకుంది. ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. డిసెంబర్ 4ను రిలీజ్ డేట్‌గా ఫైనల్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. అదే రోజు నాగచైతన్య వృషకర్మ థియేటర్లలోకి రాబోతుంది. ఒకే రోజు నాగచైతన్య, శోభిత ధూళిపాళ నటించిన వేర్వేరు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. భర్త సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఫస్ట్ టైమ్ శోభిత పోటీపడబోతుండటం ఉత్కంఠను పంచుతోంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.